క్లుప్తంగా

అంగన్‌వాడీ టీచర్లకు దుస్తుల పంపిణీ


అంగన్‌వాడీ టీచర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న అధికారులు

నింద్ర: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లకు ఎంపీపీ దీప శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే దుస్తులను టీచర్లు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేంద్ర బాబు, సీడీపీఓ కృష్ణవేణి, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ జయశ్రీ, జిల్లా కార్యదర్శి మేరీ, సూపర్‌వైజర్ శ్యామల పాల్గొన్నారు.

నగరిలో..

నగరి : మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు మున్సిపల్ కార్యాలయంలో సీడీపీఓ కృష్ణవేణి అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి పాల్గొని యూనిఫాం పంపిణీ చేశారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ లీలామాధవి, ఎంపీపీ భార్గవి పాల్గొని అందజేశారు.

విజయపురంలో..

విజయపురం (నగరి) : మండలంలోని 39 అంగన్‌వాడీ కేంద్రాలు, 12 మినీ అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లకు తహసీల్దార్ వెంకట్రాయులు చేతుల మీదుగా ప్రభుత్వం అందించిన యూనిఫాంను శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్లకు అందించారు. పీహెచ్‌సీ ఆవరణలో సీడీపీఓ కృష్ణవేణి అధ్యక్షతన అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలకు యూనిఫాం అందజేశారు.

బాలగురునాథీశ్వరుడికి ప్రత్యేక పూజలు


స్వామివారికి ప్రత్యే పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం పంచాయతీ రాచపాల్యం గ్రామంలో వెలసిన బాలగురునాథీశ్వర స్వామికి శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి వివిధ అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం గ్రామస్తులు స్వామివారికి పట్టు వస్త్ర, పూజాసామగ్రితో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారిని సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు.

రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు


స్వామి, అమ్మవార్లను ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకుడు

గంగాధరనెల్లూరు : మండలంలోని నెల్లేపల్లి మిట్ట గ్రామంలో శుక్రవారం రాధాకృష్ణుల స్వామి, అమ్మవారిని ప్రత్యేక పూజలు చేశారు. అదే గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ స్విట్జర్లాండ్ సైంటిస్ట్ భాస్కర్ రెడ్డి స్వామి, అమ్మవారి పూజా సామగ్రిని మంగళవాయిద్యాలతో గ్రామాల్లో ఊరేగింపుగా తీసుకెళ్లి సమర్పించారు. ఉభయదారులు తీసుకొచ్చిన పూజా సామగ్రితో ఆలయ అర్చకులు స్వామి, అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్

పాలసముద్రం : గ్రామ సచివాలయాల్లో పని చేసే ఉద్యోగులు సమయపాలన పాటించి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పదని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం సచివాలయ ఉద్యోగులు నిష్పక్షపాతంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గ్రామ సచివాలయాల్లో వచ్చే సమస్యలను త్వరగా పరిష్కరిస్తేనే ప్రజలకు నమ్మకం వస్తుందన్నారు. ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశాక సమస్యలు పరిష్కారం అవుతున్నాయని తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ భాస్కర్ మృతి



పుత్తూరు రూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏగా పనిచేస్తున్న భాస్కర్(57) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయన మృతి పట్ల తహసీల్దార్ పరమేశ్వరస్వామి, మున్సిపల్ చైర్మన్ హరి, డ్రోన్ సర్వే డీటీ స్వరూపరాణి, వీఆర్‌ఓ సంఘం నాయకులు గురుస్వామి, వీఆర్‌ఏలు సంతాపం తెలిపారు.

సంపూర్ణ పోషణకు భరోసా

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత పరిపుష్టిగా అమలు చేస్తున్నారు. ఓ మహిళ గర్భం దాల్చిన దగ్గర నుంచి ఆమె ప్రసవించి, బిడ్డ పెరిగి పెద్దవాడై, పెద్ద చదువులు చదివి ఆ కుటుంబానికి చేదోడుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిలుస్తోంది. పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది. అందులో ఒకటైన సంపూర్ణ పోషణ పథకాన్ని మరింత మెరుగుపరిచి వైఎస్సార్ కిట్లను ఇంటి వద్దకే పంపిణీ చేస్తోంది. దీంతో మహిళలు ముఖ్యమంత్రి జగనన్న మహిళా పక్షపాతి అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు
- కడుపులోని బిడ్డ నుంచి పండుముసలి వరకు ఆరోగ్యానికి పెద్దపీట
- గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- పుత్తూరు ఐసీడీఎస్ పరిధిలో లబ్ధి పొందుతున్న వారు 6,792 మంది


మహిళలకు వైఎస్సార్ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి ఆర్కే రోజా (ఫైల్)

పుత్తూరు ఐసీడీఎస్ పరిధిలో లబ్ధి పొందుతున్న వారి వివరాలు

మండలం	గర్భిణులు	బాలింతలు	6నెలల నుంచి మూడేళ్లలోపు	మూడేళ్ల నుంచి ఆరేళ్లలోపు పిల్లలు
పుత్తూరు	465	493	2,914	1,035
వడమాలపేట	177	151	1,055	502
మొత్తం	642	644	3,969	1,537

పుత్తూరు రూరల్: పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పటిష్టంగా అమలవుతోంది. గత ఆగస్టు నుంచి గర్భిణులు, బాలింతల సౌకర్యార్థం వారి ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్నారు. దీంతో మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు మాత్రం అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోంది. పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పుత్తూరు, వడమాలపేట మండలాలు ఉన్నాయి. ప్రాజెక్టు పరిధిలో గర్భిణులు 642 మంది, బాలింతలు 644 మంది, మూడేళ్లలోపు చిన్నారులు 3,969 ఆరేళ్లలోపు చిన్నారులు 1,537 మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషణ వివరాలు

సరుకులు	పరిమాణం
బియ్యం	3 కేజీలు
కందిపప్పు	1 కేజీ
వంట నూనె	500 ఎంఎల్
కోడిగుడ్లు	25
పాలు	5 లీటర్లు
రాగిపిండి	2 కేజీలు
అటుకులు	1 కేజీ
బెల్లం	250 గ్రాములు
చిక్కీ	250 గ్రాములు
కర్జూరం	250 గ్రాములు

పిల్లలకు అందిస్తున్న సంపూర్ణ పోషణ

బాలామృతం	2.5 కేజీలు
కోడిగుడ్లు	25
పాలు	2.5 లీటర్లు


గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ పద్మజ (ఫైల్)

ఆరోగ్యవంతమైన సమాజమే ధ్యేయం



ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకాన్ని పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. గర్భిణులకు రక్తహీనత కలగకుండా పోషకాహారం అందిస్తున్నాం. వీరి సంరక్షణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పథకాన్ని అమలు చేస్తోంది.
– కె.పద్మజ, సీడీపీఓ, పుత్తూరు

'పోషణ' మా పాలిట కామధేనువు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ మా పాలిట కామధేనువు. పేదరికంలో ఉన్న మాకు పోషక విలువలతో కూడిన మంచి ఆహారం అందించడం ద్వారా మహిళల్లో మనోధైర్యాన్ని నింపారు. ప్రసవానికి ముందు తరువాత, ఆపై నా బిడ్డకు ప్రభుత్వం అందిస్తున్న సేవ వెలకట్టలేనిది.
– ఇందుమతి, బాలింత, కామరాజునగర్, పుత్తూరు

ఇంటి వద్దకే వైఎస్సార్ కిట్లు..



గర్భిణులు ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని సైతం గుర్తించిన సీఎం జగనన్న వైఎస్సార్ కిట్లను నేరుగా మా ఇంటి వద్దకే పంపించడం ఎంతో సంతోషంగా ఉంది. మహిళలకు ఎప్పుడు ఏమి అవసరమో అడగకుండానే చేసి పెడుతున్న జగనన్న సేవలను ఎప్పటికీ మరచిపోలేం.
– ఎం.చైతన్యదేవి, గర్భిణి, నేసనూరు, పుత్తూరు

జగనన్న నిజంగా మహిళా పక్షపాతి..



సీఎం జగనన్న మహిళలను అన్నివిధాలా ఆదుకుంటున్నారు. ఏదో చెప్పడం కాదు..! నిజంగానే ఆయన మహిళా పక్షపాతి. అందుకే ప్రతి పథకాన్ని మహిళల పేరిటే అమలు చేస్తున్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం మా కుటుంబానికి ఎంతగానో ఆదుకుంది. సీఎం జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.
– సి.శాంతి, బాలింత, కేఎంఅగ్రహారం, పుత్తూరు

జగనన్నను మరోసారి సీఎంను చేద్దాం


ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం : వచ్చే 2024 ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేద్దామని డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి పిలుపునిచ్చారు. మండలంలోని ముద్దుకుప్పం సచివాలయ పరిధిలోని ఎగువ చొక్కమడుగు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమెకు మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక మహిళలను, వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా ? అని ఆరా తీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమణప్రసాద్ రెడ్డి, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ సిద్దయ్య, మండల కన్వీనర్ మణి, నాయకులు మాజీ సర్పంచ్ హరిప్రసాద్‌రెడ్డి శ్రీను, జనార్దన్, అల్లి ముత్తు, బాలాజీ, కాలప్ప, మణి, బాబు, మునికృష్ణ, బాలకృష్ణయాదవ్, రఘు పాల్గొన్నారు.


ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న రాష్ట్ర మహిళ నాయకురాలు కృపాలక్ష్మి

సంక్షేమ సారథి సీఎం జగనన్న

వెదురుకుప్పం: సంక్షేమ సారథి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె కృపాలక్ష్మి అన్నారు. మండలంలోని మాంబేడు దళితవాడలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో దళితుల సమస్యలు, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. అనంతరం గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. అంకితభావంతో విధులు నిర్వహించడంతో పాటు ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, మండల కన్వీనర్ పద్మనాభ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు బట్టే సుబ్రమణ్యం, గురువారెడ్డి, సర్పంచ్ గోవిందయ్య, శివాజీ, వెంకటేష్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ అనురేఖ

పాలసముద్రం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మన అందరి బాధ్యత అని, అప్పుడే మన అందరి ఆరోగ్యం బాగుంటుందని సర్పంచ్ అనురేఖ తెలిపారు. శుక్రవారం ఆముదాల గ్రామ సచివాలయ ఆవరణలో వలంటీర్లు, ఆరోగ్య సిబ్బందికి పంచాయతీ కార్యదర్శి యశ్వంత్ ఆధ్వర్యంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అనురేఖ మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి పల్లెను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గ్రీన్ అంబాసిడర్లతో ఎప్పటికప్పుడు చెత్త సేకరణ నిర్వహించి తడి, పొడి వ్యర్థాలను వేరుచేసి చెత్త సేకరణ కేంద్రాలకు తరలించి సంపద సృష్టించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలంతా సమిష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం విజయలక్ష్మి, వలంటీర్లు, ఆశా పాల్గొన్నారు.

వైభవంగా ఉట్లోత్సవం


ఉట్టి కొడుతున్న యాదవ కులస్తులు

కార్వేటినగరం: మండల కేంద్రంలో వెలసిన రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం ఉట్లోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అశేష భక్తజనం మధ్య అత్యంత వైభవంగా సాగిన ఉట్లోత్సవం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో శుద్ధి, తోమాల, కొలువు, అర్చన, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తదుపరి పంచాంగ శ్రవణం చేసి భక్తులకు సర్వదర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఉభయదేవేరులతో స్వామివారిని పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం యాదవ కులస్తులచే ఉట్లోత్సవాన్ని నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్తులు, కార్వేటినగరం నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పురవీధుల్లో వేణుగోపాలుడి విహారం..

ఉట్లోత్సవం సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలుడు శుక్రవారం పురవీధుల్లో వైభవంగా ఊరేగారు. ఈ సందర్భంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, శుద్ధి, తోమాల, అర్చన, పంచాంగ శ్రవణం, నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఉభయ నాంచారులతో పాటు శ్రీవేణుగోపాలుడి పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించి ఊరేగించారు. ఈ క్రమంలో భాగంగా భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ రమేష్‌బాబు, ఆలయ అధికారి సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది, భక్తులు పలువురు పాల్గొన్నారు.


పుర వీధుల్లో విహరిస్తున్న శ్రీవేణుగోపాలుడు

రేపటి నుంచి పవిత్రోత్సవాలు..

మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు పవిత్రోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మృత్యంగ్రహణం, సేనాధిపతి తిరువీధి ఉత్సవం, అంకురార్పణ, యాగశాల, ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగతుందన్నారు. అలాగే సోమవారం ఉత్సవమూర్తులకు తిరుమంజనం, పవిత్ర సమర్పణ, తిరువీధి ఉత్సవం, యాగశాల, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి


కంప్యూటర్లు వితరణ చేసిన దాత దశరథరెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యం రాజు

పెనుమూరు(కార్వేటినగరం) : ప్రస్తుత పోటీ ప్రపంచంలో పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞాన అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ప్రతి ఒక్కరూ కంప్యూటర్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని వీ.కోటకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త దశరథరెడ్డి అన్నారు. శుక్రవారం పెనుమూరు జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డేను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి తగ్గట్టు సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారించేలా విద్యాబోధనలు చేపట్టాలన్నారు. ఈ క్రమంలో భాగంగా పారిశ్రామిక వేత రూ.3 లక్షలు విలువ చేసే కంప్యూటర్లను వితరణ చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ బాలసుబ్రమణ్యంరాజు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు దాతలు కంప్యూటర్లు అందించి విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపక బృందం విద్యార్థుల తరపున దాత దశరథరెడ్డిని శాలువలు కప్పి, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు జాతీయ లోక్‌అదాలత్

- పుత్తూరు సీనియర్ సివిల్‌జడ్జి రాఘవేంద్ర


జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: పుత్తూరు సబ్‌కోర్టు ఆవరణలో శనివారం ఉదయం 10.30 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పుత్తూరు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్ సందర్భంగా మూడు బెంచ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బెంచ్ ప్రొసీడింగ్ ఆఫీసర్లుగా జడ్జీలు రాఘవేంద్ర, జానకి, గోపాలకృష్ణ వ్యవహరిస్తారని వివరించారు. న్యాయవాదులు, పోలీసులు ప్రధానంగా ప్రామిసరీ నోటు, చెక్కుబౌన్స్ కేసులు రాజీ చేయాలని సూచించారు. పెండింగ్‌లోని సివిల్, రాజీకి చేయబడిన క్రిమినల్ కేసులు, మనోవర్తి, ప్రీలిటిగేషన్ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైందని కక్షిదారులకు అవగాహన కల్పించాలని వివరించారు. అలాగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు


కొటార్వేడు దళితవాడలో కార్డన్ సర్చ్ చేస్తున్న పోలీసులు

కార్వేటినగరం: అక్రమంగా సారా తయారీ, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ దస్తగిరి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొటార్వేడు దళితవాడ సమీపంలో కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సారా అమ్మకాలు, తయారీకి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడమే కాకుండా భారీ జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధం చేసి ఉంచిన 400 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేయడమే కాకుండా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 19 లీటర్ల సారాను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. సారా కట్టడికి యువత, మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జయశంకర్, పోలీస్ సిబ్బంది, ఎస్టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


పరుగులు పెడుతున్న అభివృద్ధి


100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏడీఈ, విద్యుత్ అధికారులు

- రూ.1.78 కోట్ల నిధులతో కార్వేటినగరం పంచాయతీ అభివృద్ధి
- డిప్యూటీ సీఎం నారాయణస్వామికి పంచాయతీ ప్రజల కృతజ్ఞతలు

కార్వేటినగరం: గతంలో ఎన్నడూ లేనివిధంగా మేజర్ పంచాయతీ కార్వేటినగరం పెద్దదళితవాడను డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో అభివృద్ధి చేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. శుక్రవారం కార్వేటినగరం పెద్ద దళితవాడలో సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శాంతి ఆధ్వర్యంలో రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన అదనపు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి నేతృత్వంలో కార్వేటినగరం పంచాయతీ అభివృద్ధికి రూ.1.78 కోట్లు నిధులు కేటాయించినట్లు చెప్పారు. పెద్ద దళితవాడలో విద్యుత్ సమస్యను అధిగమించడానికి గ్రామస్తులు చెప్పిన వెంటనే అదనంగా 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించిన ఘనత డిప్యూటీ సీఎంకే దక్కుతుందన్నారు. అదేవిధంగా గ్రామంలో తుడా నిధులతో రూ.31 లక్షలతో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేశామన్నారు. ఎంపీపీ నిధులు రూ.20 లక్షలను కమ్యూనిటీ భవనంలో మౌలిక వసతులకు వెచ్చించామన్నారు. అలాగే రూ.70 లక్షలతో దళితవాడలో పెద్దఎత్తున డ్రైనేజీ నిర్మాణం చేపట్టామని, రూ.7 లక్షలతో సీసీ రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు రూ.7 లక్షలు, అదేవిధంగా రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మాణానికి రూ.37 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగనన్న, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ప్రత్యేక కృషి చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు సమస్యలను విస్మరించాయన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు శేషాద్రి, విద్యుత్ ఏడీఈ నాగరాజు, ఏఈ రియాజ్, సబ్‌ఇంజినీర్ దినేష్, దాము, గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

13 నుంచి స్కూల్ గేమ్స్ ప్రారంభం


మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సురేష్‌బాబు

పుత్తూరు రూరల్: మండల, నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఈనెల 13 నుంచి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి వి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించే క్రీడా మైదానాలను ఎంపిక చేశారు.

అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ అండర్-14, అండర్-17 బాల బాలికలకు ఈనెల 13 నుంచి 16 వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలస్థాయి విజేతలకు నియోజకవర్గ స్థాయిలో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్లు మణి, నందకుమార్, గోపీకృష్ణ, చంద్రశేఖర్‌రాజు, గురప్ప, ఐదు మండలాల పీడీలు పాల్గొన్నారు.

13వ తేదీ నుంచి 16 వరకు మండల స్థాయిలో జరిగే పోటీలు

పుత్తూరు ఎస్‌ఆర్‌ఎస్ హైస్కూల్: కోకో, బాల్‌బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్
పుత్తూరు గొల్లపల్లి: వాలీబాల్, త్రోబాల్, టెన్నీకాయిట్, కబడ్డీ
నగరి జెడ్పీహెచ్‌ఎస్: వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, కోకో, బాల్‌బాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, షటిల్
వడమాలపేట జెడ్పీహెచ్‌ఎస్: అన్ని క్రీడలు
విజయపురం జెడ్పీహెచ్‌ఎస్: అన్ని క్రీడలు
నింద్ర జెడ్పీహెచ్‌ఎస్: అన్ని క్రీడలు

నియోజకవర్గ స్థాయి పోటీల వివరాలు

18-9-23 వడమాలపేట: వాలీబాల్, బాడ్మింటన్,
19-9-23 నగరి: త్రోబాల్, టెన్నీకాయిట్, బాల్‌బాడ్మింటన్, కబడ్డీ,
20-9-23 పుత్తూరు: యోగా, అథ్లెటిక్స్, కోకో